క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ: మండల కేంద్రంలోని చవటకుంటలో చేప పిల్లల పంపిణీ, ఎంపీడీఓ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి నేడు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం'

గణపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని గణపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలం నుంచి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా రైతాంగాన్ని మోసం చేస్తుందని ఆరోపించారు. యాసంగి, వానాకాలం పంటలకు రైతు భరోసా ఇవ్వలేదని, వరి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని మాట తప్పారని, రైతు రుణమాఫీ ఇప్పటి వరకు పూర్తి కాలేదన్నారు.

ఎల్ఓసీ అందజేత



మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గాదెంపల్లి గ్రామానికి చెందిన నల్ల మహేందర్ కిడ్నీ సంబంధింత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, ఆర్థిక సాయం కోసం కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50లక్షలు ఎల్ఓసీ మంజూరు చేయించి మంత్రి శ్రీధర్‌బాబు ఆస్పత్రి సహాయకుడు ద్వారా శనివారం ఎల్ఓసీ పత్రానికి కుటుంబ సభ్యులకు అందించారు.

రుక్సానా మొహమ్మద్‌కు డాక్టరేట్



భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న రుక్సానా మొహమ్మద్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కామర్స్ విభాగంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ శంకరయ్య పర్యవేక్షణలో 'కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ అకౌంటింగ్ ప్రాక్టీసెస్ ఏ స్టడీ ఇన్ సెలెక్ట్ కంపెనీస్' అనే అంశంపై పరిశోధన చేసి ఉత్తీర్ణురాలై డాక్టరేట్ అందుకుంది. ఈ మేరకు శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్‌విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కృష్ణ చైతన్య చేతుల మీదుగా డాక్టరేట్ తీసుకున్నారు. అవార్డు అందుకున్న రుక్సానాను శనివారం భూపాలపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, తోటి అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభినందనలు తెలిపారు.

దోమతెరలు తప్పనిసరిగా వాడాలి

వాజేడు: ప్రతి ఒక్కరూ దోమతెరలను తప్పనిసరిగా వాడాలని మాతా శిశు సంరక్షణ మండల వైద్యాధికారి యోషిత అన్నారు. మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 42 మంది రోగులను పరీక్షించారు. 30 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి రక్త పోటు, మధుమేహం నిర్ధారణ పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షయ, రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు మందులను వాడాలని సూచించారు. ఈ కార్య క్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్ వెంకట రమణ, కోటిరెడ్డి, వైద్య సిబ్బంది అనూష, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఆర్థికసాయం

ములుగు రూరల్: మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన తంగళ్లపల్లి నర్సయ్య ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ శనివారం పరామర్శించి 50 కేజీల బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ యూత్ ప్రధాన కార్యదర్శి రేవంత్‌యాదవ్, కుమార్‌గౌడ్, నల్లెల్ల భరత్‌కుమార్, తిరుపతి, వంశీక్రిష్ణ, మోర రాజమౌళి, రాజేందర్, రమేష్ ఉన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో పలక రవీందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి గండెపల్లి ఫౌండేషన్ సభ్యులు శనివారం 50కిలోల బియ్యం, 2వేల నగదును అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ గండెపల్లి నర్సయ్య, గండెపల్లి సత్యం, శ్రీనివాస్, కిరణ్ ఉన్నారు.

దళారుల పత్తి దందా..

- తేమ పేరుతో ధర తగ్గింపు
- ప్రారంభం కాని సీసీఐ కొనుగోళ్లు
- నష్టపోతున్న రైతులు



టేకుమట్లలో నిల్వ చేసిన పత్తి

టేకుమట్ల: రైతులు పండించే వాణిజ్య పంటల్లో పత్తి మొదటి స్థానంలో ఉంటుంది. ఈ సంవత్సరం మండలంలో రైతులు సాగు చేస్తున్న విస్తీర్ణం 8346 ఎకరాలు కాగా అందులో 70శాతం పత్తి పంటలు అధిక వర్షాలకు తెగుళ్ల సోకి ఎదుగుదల లోపించడంతో పాటు, కుచ్చు తెగులు సోకింది. గతంలో కంటే ఈ సంవత్సరం తెగుళ్ల బెడదతో పెట్టుబడి సైతం పెరిగింది. పత్తి పంట దిగుబడి ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా తెగుళ్లతో 10 క్వింటాళ్లు దిగుబడి కూడా అసాధ్యమనే రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. కూలీల రేట్లు కూడా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పడిపోయిన పత్తి ధర

రైతులు పండించిన పత్తి కొనుగోళ్లు చేపట్టే సీసీఐ(కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా) ఇప్పటి వరకు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో పత్తి చేను నుంచి ఏరిన పత్తి తేమతో రంగు మారుతుందనే భయంతో రైతులు స్థానిక మిల్లులు, స్థానిక పత్తి కొనుగోలుదారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు తేమ పేరుతో క్వింటాళుకు కేవలం రూ.5వేల నుంచి 6వేల వరకు మాత్రమే ధర చెల్లిస్తూ రైతులను మోసం చేస్తున్నారు. అలాగే గ్రామాల్లో సైతం కొనుగోలు చేసే కొనుగోలు దారులు కాంటాల ద్వారా మోసం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సీసీఐ ప్రారంభిస్తే ప్రభుత్వ మద్దతు ధర రూ.7500పైగా ఉంటుంది. సీసీఐ కొనుగోలు చేపట్టకపోవడంతో రైతులు చేసేదేంలేక నష్టాలకు విక్రయిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

గ్రామాల్లో కొనసాగుతున్న అక్రమ పత్తి కాంటాలను నివారిస్తూ, రైతులకు ప్రభుత్వం నుంచి మద్దతు ధర కల్పించాల్సిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పట్టించుకోక పోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు పత్తి తేమ దందా వరంగా మారింది. క్వింటాకు సుమారు రూ.1000కి పైగా నష్టపోతున్న రైతుల పక్షాన అధికారులు గానీ పాలకులు గానీ నిలబడకపోవడం లేదు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు నష్టాలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీఐ కొనుగోళ్లను ప్రారంభించి అక్రమ కాంటాలను నివారించాలని రైతులు వేడుకుంటున్నారు.

మిల్లులో కొంటలేరు..



మిల్లులో తేమ పేరుతో పత్తిని క్వింటాకు రూ.5వేలు మాత్రమే చెల్లిస్తాం, లేదంటే మీ ఇష్టం మేము కొనలేమంటున్నారు. చేసేందేంలేక తక్కువ దరకు అమ్ముకుంటున్నాం. అప్పులు తెచ్చి పంటలను పండిస్తే ఏమీ మిగలడం లేదు. ప్రభుత్వం స్పందించి సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించాలి.

- సల్పాల రాజయ్య, రైతు, రామకిష్టాపూర్(టి)

ధర వస్తదని నిల్వ చేస్తున్నా...



వర్షాల వల్ల పత్తి పంట ఎదుగుదల లేదంటే, ఇప్పుడు పత్తికి ధర లేకపోవడంతో పండించిన పంటను దళారులకు ఇవ్వాల్సి వస్తుంది. వేలల్లో పెట్టుబడి పెట్టి తక్కువ ధరకు పత్తిని అమ్ముకుంటే కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు. దీంతో పత్తి ధర కోసం ఏరిన పత్తిని నిల్వ చేస్తున్నా. పత్తికి ధర రావాలి. లేదంటే అప్పులే మిగులుతాయి.

- కాటం రవ్వయ్య, రైతు, అంకుషాపూర్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న చంద్రశేఖర్

కాటారం: కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్, పలిమెల మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఆయన పీఏ ఆకుల చంద్రశేఖర్ శనివారం పంపిణీ చేశారు. కాటారం మండలంలో 8 చెక్కులు, మహదేవపూర్ మండలంలో 10, మహాముత్తారం 6, మల్హర్ మండలంలో 22, పలిమెల మండలంలో ఇద్దరు లబ్ధిదారులకు చెక్కులు మంజూరు కాగా స్వయంగా వారి గ్రామానికి వెళ్లి అందజేసినట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



గాంధీనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: పట్టణాలతో పాటు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ.8కోట్ల 44లక్షల వ్యయంతో యంఆర్ఆర్ నిధులు, సీఎస్ఆర్(టీజీ జెన్‌కో)ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గాంధీనగర్, గణపురం, సీతారాంపురం, నగరంపల్లి, ధర్మరావుపేట, పరుశరాంపల్లి, వెంకటేశ్వర్లపల్లి, చెల్పూరు ఎస్సీ కాలనీలలో మోడల్ అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అలాగే ధర్మరావుపేట నుంచి పెద్దాపురం గ్రామం వరకు బీటీ రోడ్డు, పరుశరాంపల్లి నుంచి బస్వరాజుపల్లి గ్రామం వరకు, బస్వరాజుపల్లి నుంచి ధనినగర్ వరకు, చెల్పూరు నుంచి బొబ్బలోని పల్లె వరకు బీటీ రోడ్ల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలే లక్ష్యంగా తాను నిర్విర్యామంగా కృషి చేస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు, గ్రామస్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు



చెక్కెర పానకం పారబోస్తున్న అధికారులు

కాటారం: గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు. మహాముత్తారం మండలం బోర్లగూడెం, పోచంపల్లి, స్తంభంపల్లి, సింగారం, గాజరాంపల్లి, పెగడపల్లి గ్రామాల్లో అక్రమంగా తయారు చేస్తున్న గుడుంబా స్థావరాలపై శనివారం ఎక్సైజ్, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్త దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 43 లీటర్ల నాటుసారాను, 5 కిలోల పట్టిక, 7 కిలోల ఈస్ట్, 3.6లీటర్ల మద్యం, 5 బీర్లు, 150 కిలోల చక్కెరను స్వాధీనపర్చుకొని 2300 లీటర్ల చక్కెర పానకంను పారబోసినట్లు తెలిపారు. ఈ మేరకు 8 మందిపై కేసులు నమోదు చేసి నలుగురు గుడుంబా తయారీదారులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజసమ్మయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ రజిత, సిబ్బంది రాంచందర్, శ్రీకాంత్, వెంకట్ రాజు, సునీల్, వెంకన్న, వరుణ్, శివ పాల్గొన్నారు.

లక్ష్మీదేవర ఆలయంలో అభివృద్ధి పనులు



ఆలయ ఆవరణలో నిల్చున్న గ్రామస్తులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలోని ప్రసిద్ధ లక్ష్మీదేవర ఆలయ పునరుద్ధరణ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఎడ్లపల్లి గ్రామానికి చెందిన ఒక దాత సహకారంతో.. ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో ఆలయంలో ఫ్లోరింగ్ గ్రానైట్ పనులు శనివారం పూర్తి చేశారు. భవిష్యత్‌లో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు ఆలయ పెద్దమనుషులు, పూజారులు, ముదిరాజ్ కులస్తులు తెలిపారు. మాజీ సర్పంచ్ జనగాం స్వరూప బాపు, ఆలయ పెద్ద మనిషి అక్కినవేన నాగయ్య, ఆలయ పూజారి అక్కినవేని చిన్న కిష్టయ్య, దేవర మనిషి పిట్టల మల్లేష్, నాయకులు అగ్రం వికాస్ రాజు, ఉరవేద్ది సమ్మయ్య, జంగ రమేష్, అక్కినవేని మాంతయ్య, అక్కినవేన శ్రీను, అక్కినవేన సుమన్, చిన్నవేన కిరణ్ , మేకల రాజు, సతీష్ పాల్గొన్నారు.

హాస్టల్ డోర్ ఎదుట కేక్ పెట్టిన యువకుడు

- విచారణ చేపట్టిన డీఈఓ
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ప్రిన్సిపాల్



విచారణ చేపడుతున్న డీఈఓ రాజేందర్

చిట్యాల: రాత్రి వేళలో స్థానిక మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లోకి గుర్తు తెలియని వ్యక్తి వెళ్లి డోర్ ఎదుట కేక్ పెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. ఈ నెల 24న రాత్రి గుర్తుతెలియని వ్యక్తి కేక్ పట్టుకుని కళాశాలలోకి వచ్చి గేట్ ఎదుట ఉన్న పెద్ద డోర్ వద్ద పెట్టి వెళ్లాడు. విషయం తెలుసుకున్న హాస్టల్ సిబ్బంది, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుమలతకు తెలుపడంతో ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా కళాశాలకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చిన సమాచారాన్ని తెలుసుకున్న డీఈఓ రాజేందర్ శనివారం వచ్చి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు మళ్లీ జరుగకుండా చర్యలు చేపడుతామని అన్నారు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీని రికార్డు అయిన దృశ్యాలను చూసి అనుమానిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సభ్యత్వాలు నమోదు చేయించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: బీజేపీ సభ్యత్వ నమోదును భూపాలపల్లి మండలంలోని గ్రామాల్లో విస్తృతంగా చేయించాలని మండల కన్వీనర్ రెంటాల విప్లవ్ కుమార్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. శనివారం మండలంలోని ఆజాంనగర్‌లో బీజేపీ శక్తికేంద్రం ఇన్‌చార్జ్ దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విప్లవ కుమార్‌రెడ్డి హాజరై కార్యకర్తలకు దిశనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పోషన్న, రాజు, వెంకన్న రవి, సుకేందర్ రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

గుడిసెలను కూల్చడం అమానుషం

ములుగు రూరల్: మండలంలోని ఇంచర్ల శివారులో ఆరు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్న నిరుపేదల గుడిసెలను తొలగించడం అమానుషమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ అన్నారు. శనివారం గుడిసెవాసులతో ఆయన మాట్లాడారు. రెవెన్యూ, పోలీసులు దాడులు నిర్వహించి గుడిసెవాసులను నిరాశ్రయులుగా మార్చారని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక వేసుకున్న గుడిసెలు తొలగించడం దారుణమని అన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని అన్నారు. నాయకులు గోవింద్ నాయక్, గుడిసెవాసులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లలో శ్రమదానం



టేకుమట్ల: శ్రమదానం చేస్తున్న పోలీసులు



చిట్యాలలో..

టేకుమట్ల: ఆహ్లాదకర వాతావరణంలో పోలీస్‌స్టేషన్ కొనసాగుతుందని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ సిబ్బందితో కలిసి శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణంలోని పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. అలాగే పోలీస్‌స్టేషన్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం విశాలవంతంగా ఉందని, పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతం కూడా విశాలవంతంగా ఉండాలనే లక్ష్యంతో సిబ్బందితో కలిసి శ్రమదాన కార్యక్రమం చేసినట్లు తెలిపారు. ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ మల్లన్న, కానిస్టేబుళ్లు వెంకటేష్, లవకుమార్, మహేందర్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో సీఐ మల్లేష్, ఎస్సై శ్రావన్‌కుమార్ సిబ్బందితో కలిసి శనివారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది యాకయ్య, సురేందర్, అస్లాం జానీ, నవీన్, లాల్‌సింగ్, లింగన్న, సందీప్, నాగరాజు, ప్రసాద్, రాజయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఓంకార్‌కు ఘన నివాళి

ములుగు రూరల్: ఎంసీపీఐ(యూ)వ్యవస్థాపకుడు మాజీ ఎమ్మెల్యే మద్దికాయ ఓంకార్ వర్ధంతిని జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మనువాద కార్పొరేట్ పెట్టుబడిదారులతో దేశ ప్రజలకు, రాజ్యాంగానికి ముప్పు ఉందని అన్నారు. కుల, మత విభేదాలను రాజకీయ పార్టీలు పెంచి పోషిస్తున్నాయని తెలిపారు. జమిలి ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ విలువలను సమాధి చేసేవిధంగా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడంబోయిన చంద్రయ్య, బాబురావు, జంగిలి సుధాకర్, రాజన్న, ఆదిరెడ్డి, రాంరెడ్డి, రాజమౌళి, రవి, మల్లయ్య కొమురయ్య పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

ములుగు రూరల్: కుటుంబ విషయంలో మధ్యలో జోక్యం చేసుకుని వ్యక్తిపై చేయి చేసుకున్న సంఘటనలో ఐదుగురిపై కేసు నమోదైంది. ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లంపల్లి గ్రామానికి చెందిన దుమాల రాజేష్ తన భార్య మాసనతో గొడవ పడుతున్న క్రమంలో గ్రామానికి చెందిన నాగరాజు, శ్యాంరావు, రవి, శ్రీను, గోపి అనే ఐదుగురు రాజేశ్‌పై చేయిచేసుకున్నారని తెలిపారు. మనస్థాపానికి గురైన రాజేశ్ ఈ నెల 23వ గడ్డి మందు తాగాడు. ములుగు ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం దామెర క్రాస్ రోడ్డులో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడని తెలిపారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాటన్ మిల్లు ప్రారంభాన్ని నిలిపేయాలి

చిట్యాల: మండల కేంద్రంలోని కాకతీయ కాటన్ మిల్లు ప్రారంభాన్ని నిలిపివేయాలని మండలంలోని పలు గ్రామాలకు చెందిన పత్తి రైతులు శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల క్రితం పాత యాజమానికి పత్తితో పాటు డబ్బులు అందజేయడం జరిగిందని తెలిపారు. కానీ ఆయన ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వకుండా దాటవేస్తూ అనేక ఇబ్బందులకు గురి చేశాడని తెలిపారు. ఈ క్రమంలో రెండు సంవత్సరాల క్రితం బ్యాంక్ లోన్ ప్రీమియం చెల్లించకపోవడంతో మిల్లును అధికారులు సీజ్ చేసిన అనంతరం వేలం వేసినట్లు పేర్కొన్నారు. కాగా కొత్త యాజమానిదగ్గరికి వెళ్లి తమకు డబ్బులు రావాలని అడగగా మాకు ఏలాంటి సంబంధం లేదని తెలిపాడని రైతులు వాపోయారు. కావున జిల్లా అధికారులు స్పందించి రైతులకు రావాలసిన డబ్బులు ఇప్పించగలరని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆకుల రవీందర్, నారాయణ, సదానందం, రాజు, నర్సింహారెడ్డి, పబ్బ రవీందర్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలిని చేరదీత



సఖి కేంద్రంలో వృద్ధురాలు

భూపాలపల్లి రూరల్: చిట్యాల మండలం గిద్దముత్తారం గ్రామంలో మతి స్థిమితంలేని వృద్ధురాలని సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ గాయత్రి శనివారం చేరదీశారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ.. గిద్దముత్తారం బస్సు షెల్టర్‌లో పది రోజుల నుంచి వృద్ధ మహిళ ఉంటుందని ఆ గ్రామానికి చెందిన బైరి కుమార్, హరీశ్‌గౌడ్ మహిళా హెల్ప్ లైన్ 181కి ఫోన్ చేసినట్లు తెలిపారు. దీంతో అక్కడికి వెళ్లి మతిస్థిమితం కోల్పోయి ఉన్న వృద్ధురాలిని జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్‌కు తీసుకువచ్చామన్నారు. ఇంటికి పంపించడం కోసం వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో బాధిత మహిళలు సమస్యల పరిష్కారానికి సఖి సెంటర్ ను ఆశ్రయించాలన్నారు. రాలేని సమయంలో సఖి నంబర్ 85000 09433కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లను రహస్యంగా ఉంచుతామని తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలపాలి

వెంకటాపురం(కె): వాజేడు, వెంకటాపురం మండలాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలపాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ సమస్యలపై ఏటూరునాగారం ఐటీడీఏకు వెళితే భద్రాచలం ఐటీడీఏకు వెళ్లాలని చెబుతున్నారని అన్నారు. వీలిన మండలాల సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారని అన్నారు. ఆదివాసీ చట్టాలను పలు పార్టీలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు.

వర్గీకరణ అమలుచేయకపోతే యుద్ధమే



వరంగల్ బయల్దేరిన నాయకులు

ములుగు: ఎస్సీ వర్గీకరణ అమలేచేయకపోతే రేవంత్‌రెడ్డి సర్కారుతో యుద్ధమే అని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, అనుబంధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వరంగల్‌లో నిర్వహించిన హలో మాదిగ.. ఛలో వరంగల్ నినాదంతో మాదిగల ధర్మయుద్ధ మహాసభకు జిల్లాకేంద్రం నుంచి భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఇరుగుపైడి మాదిగ, మడిపెల్లి శ్యాంబాబు, గజ్జెల ప్రసాద్, పుల్లూరి కర్ణాకర్, గజ్జెల ప్రశాంత్, పేరాల బలరాం, వావిలాల సాంబశివరావు, మరాఠి రవీందర్ ఉన్నారు.